పత్తి పాయె.. మక్క వచ్చే



నారాయణపురంలో పత్తి పైరును తొలగిస్తున్న రైతు

- పెట్టుబడులు కూడా రాని పత్తిపంట
- అధిక వర్షాలతో తీవ్ర నష్టం
- పత్తికి బదులుగా ఆడ, మగ మొక్కజొన్న సాగు



పత్తిని తొలగించిన పొలంలో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

తల్లాడ: పోయిన దగ్గర వెతికితే దొరుకుతుందనే నానుడిని రైతులు అవలంబిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తిపైరు అధిక వర్షాల కారణంగా దెబ్బతిని దిగుబడి తగ్గింది. ఎకరానికి పదిక్వింటాళ్లు రావాల్సిన పత్తి.. ఈ సారి ఆరు క్వింటాళ్లకే పరిమితమైంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. తల్లాడ మండలం నారాయణపురం, రెడ్డిగూడెం, పినపాక గ్రామాల్లో రైతులు తమ పత్తి పంట నష్టాన్ని పూడ్చుకునేందుకు పత్తిపైరును తొలగించి మళ్లీ దుక్కులు దున్ని రెండో పంటకు సిద్ధం చేసి విత్తనాలు నాటుతున్నారు. మరికొందరు మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

పెట్టుబడులు కూడా రాని వైనం..

ఈ ఏడాది మండలంలో 6,500 ఎకరాల్లో పత్తిపైరు సాగు చేశారు. వర్షాల కారణంగా చీడపీడలు, పూత రాలి ఎకరానికి కేవలం 5నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. దీంతో రైతులకు కనీసం పెట్టుబడికూడా రాని పరిస్థితి నెలకొంది. రైతులు ఎకరానికి రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టడంతో పాటు కౌలుకి రూ.30వేల నుంచి రూ.40 వేల వరకు ఉంటుంది. ఆరుక్వింటాలు దిగుబడి వస్తే.. సుమారు రూ.45వేల వరకు రైతుకు వస్తుంది. ఈ విధంగా రైతులు ఈ సంవత్సరం తీవ్రంగా నష్టాలను చవి చూశారు.

ఇప్పటికే 1,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు..

కొందరు రైతులు మండలంలో పత్తి పైరును ఇప్పటికే వెయ్యి ఎకరాల్లో తొలగించి మొక్కజొన్న సాగు చేశారు. దీనికి పెట్టుబడి తక్కువగా ఉండడంతో పాటు.. కేవలం 120 రోజుల్లోనే చేతికి వస్తుండటంతో దీనిపై రైతులు శ్రద్ధ చూపుతున్నారు. మొక్కజొన్న విత్తనాలను కూడా కంపెనీ సబ్సిడీపై సరఫరా చేస్తుంది. మొక్కజొన్న ఎకరానికి రూ.20వేలు పెట్టుబడి పెడితే దిగుబడి 35నుంచి 40 క్వింటాళ్ల వరకు వస్తుంది. క్వింటా రూ.3 వేలు చొప్పున చూసుకున్నా.. 40 క్వింటాళ్లకు రూ. 1.20 లక్షలు రైతు చేతికొస్తుంది.

ఆడ, మగ మొక్క జొన్నకే మొగ్గు చూపుతున్న రైతులు..

పత్తి పీకి దాని స్థానంలో ఆడ, మగ మొక్కజొన్న విత్తనాలు పెడుతున్నారు. దీనికి సాగర్ కాల్వల ద్వారా నీటి సౌకర్యం కూడా ఉడడంతో రైతులు నాలుగైదు రోజులుగా కూలీలతో విత్తనాలు పెట్టిస్తున్నారు.

10 ఎకరాల్లో పత్తి తొలగించా..



ఖరీఫ్‌లో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తిపైరు సాగు చేశాను. ఎకరానికి పెట్టుబడి రూ.50 వేలు ఖర్చుకాగా.. పెట్టిన పెట్టుబడికూడా రాలేదు. అందుకే నష్టాన్ని పూడ్చుకునేందుకే పత్తిని తొలగించి ఆడ, మగ మొక్కజొన్న పైరు సాగు చేశాను.

– గూడూరు నర్సిరెడ్డి, కౌలు రైతు, నారాయణపురం

పత్తి కంటే మొక్కజొన్న మెరుగు..



పత్తి పైరుకు పెట్టుబడి ఎక్కువ అయ్యింది. దీనికి తోడు దిగుబడి కూడా తగ్గడంతో తీవ్ర నష్టం ఏర్పడింది. అదే మొక్కజొన్నకు పెట్టుబడి తక్కువ.. దిగుబడి ఎక్కువా. కావున ఈ పంట ద్వారానైనా ఖరీఫ్‌లో జరిగిన నష్టం వస్తుందని బావిస్తున్నాం.

– గొడుగునూరి అనురాధ, రైతు, నారాయణపురం

క్లుప్తంగా

డిజిటల్ లైబ్రరీపై బాలికలకు అవగాహన



గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్న అధ్యాపకులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం బాలికలకు డిజిటల్ లైబ్రరీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల కంప్యూటర్స్ సైన్స్ హెచ్‌ఓడీ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రావణి, వైస్ ప్రిన్సిపల్ నవ్య, ఐక్వాక్ కోఆర్డినేటర్ ఐశ్వర్య, సీజీసీ కోఆర్డినేటర్ రజినీ, లైబ్రేరియన్ మమత, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ యోగా చేయండి



యోగా శిక్షణ ఇస్తున్న ఇన్‌స్ట్రక్టర్లు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామంలోని హోమియో వైద్యశాలలో నిర్వహిస్తున్న ఉచిత యోగా తరగతులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ భార్గవి తెలిపారు. గురువారం ఆస్పత్రిలో పలువురికి యోగా శిక్షణ ఇచ్చారు. మహిళలకు, పురుషులకు యోగా నిర్వహణకు గానూ ఇన్‌స్ట్రక్టర్లు వేర్వేరుగా నియామకమైనట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్లు కిశోర్‌రెడ్డి, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

హాజరు శాతం పెంచండి

సత్తుపల్లిటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల హాజరు శాతం పెంచాలని సీడీపీఓ కనక దుర్గ ఆదేశించారు. గురువారం రేగళ్లపాడు, బుగ్గపాడు, అయ్యపేట, గుడిపాడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి స్టాక్ రికార్డులను తనిఖీ చేశారు. పిల్లల బరువులు, ఎత్తులు, ప్రీస్కూల్ కార్యక్రమాలను పరిశీలించారు. పూర్వ ప్రాథమిక విద్యను సిలబస్ ప్రకారం చెప్పాలని సూచించారు. బుగ్గపాడు, రేగళ్లపాడు పాఠశాలల్లో చిన్నారి ముచ్చట్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బాలాజీ, డాక్టర్ నవ్యశ్రీ, ఉపాధ్యాయులు సురేష్, బాగ్యలక్ష్మి, శ్రావణి, నాగేశ్వరి పాల్గొన్నారు.

బైక్‌ను తప్పించబోయి ఆటో బోల్తా

వైరారూరల్: వైరా మున్సిపాలిటీ పరిధి గండగలపాడు సమీపాన బైక్‌ను తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడగా పలువురికి గాయాలయ్యాయి. తల్లాడ మండలం కేశవపురానికి చెందిన తాళ్లూరి సత్తిబాబు, చింతపట్ల సరిత తదితరులు ఏపీలోని గౌరవరంలో ఇటీవల మృతిచెందిన తమ బంధువు దశదిన కర్మకు గురువారం ఆటోలో వెళ్లి సాయంత్రం తిరిగి వస్తున్నారు. ఈక్రమాన గండగపాడు సాయిబాబా ఆలయం వద్ద ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని డ్రైవర్ తప్పించే క్రమాన ఆటో పల్టీ కొట్టింది. ఘటనలో సత్తిబాబు, సరితకు తీవ్ర గాయాలు కాగా మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈమేరకు పోలీసులు క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మజ్దూర్ యూనియన్‌కు మద్దతు ఇవ్వండి

కారేపల్లి: కార్మికుల హక్కుల సాధనే ధ్యేయంగా మజ్దూర్ యూనియన్ పని చేస్తుందని, రానున్న గుర్తింపు ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్‌కు మద్దతుగా నిలిచి గెలిపించాలని.. మజ్దూర్ యూనియన్ సికింద్రబాద్ డివిజన్ అధ్యక్షుడు ఖాజాబాబా అన్నారు. గురువారం డోర్నకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కారేపల్లి సెక్షన్‌లో రైల్వే కార్మికులను ఆయన కలిసి మద్దతు తెలిపాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో డోర్నకల్ బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ సెక్రటరీ అంజయ్య, చైర్మన్ చరణ్‌నాయక్, అసిస్టెంట్ సెక్రటరీ బాలాజీ, అక్షయ్‌కుమార్, స్వామి, శ్రీను, సునీల్, రమేష్, రవి, రాందాస్ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తల్లాడ: తల్లాడ మండల విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. వ్యవస్థాపకుడు బాజోజు శేషభూషణం ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తల్లాడ మండల అధ్యక్షుడిగా రుద్రాక్ష నరసింహాచారి, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ కృష్ణ, ఉపాధ్యక్షుడిగా రవి, కోశాధికారిగా వెంకటాచారి, సహాయ కార్యదర్శిగా రుద్రాక్ష బ్రహ్మం, గౌరవ సలహాదారులుగా బ్రహ్మయ్య, బ్రహ్మాచారి, శ్రీనివాసరావు, మండల మహిళా అధ్యక్షురాలిగా పద్మావతి, మహిళా కార్యదర్శిగా సునీతను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు సన్మానించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వైరారూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ శ్రీనివాసరావు

వైరారూరల్: మండలంలోని పూసలపాడు సొసైటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సొసైటీ చైర్మన్ గాలి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, సొసైటీ మెంటర్లు గారపాటి గోపాల్‌రావు, మచ్చా వెంకటేశ్వరరావు, మొక్క గోపాలకృష్ణ, బొల్లినేని వెంకటేశ్వరరావు, బొల్లినేని సుధాకర్, సొసైటీ సీఈఓ కృష్ణ, ఏఈఓ వెంపటి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన..

ముదిగొండ: మండలపరిధిలోని వల్లభిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీడీఎం శ్రీనివాసరావు గురువారం పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం కల్పన, సీసీ వెంకటరామారావు, మాజీ ఎంపీటీసీ బిక్షం, సిబ్బంది పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

కొణిజర్ల: రైతులు పండించిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. గురువారం కొణిజర్లలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశం చింతపల్లి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించగా.. ఆయన మాట్లాడారు. తరుగు, తేమ నిబంధనలతో రైతులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. రైతులకు యాసంగి రైతు భరోసా డబ్బులు తక్షణమే అకౌంట్‌లలో వేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఫార్మాసిటీ పేరుతో లాక్కున్న భూములకు పరిహారం చెల్లించాలన్నారు. అదే విధంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, నాయకులు కృష్ణ, కృష్ణయ్య, మండల కార్యదర్శి కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసం పోరాటాలు

మధిరరూరల్: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బానిసత్వం నుంచి బయటపడేందుకు పోరాటం చేసిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని ఆ పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి ప్రసాద్ తెలిపారు. మండలంలోని మల్లవరం గ్రామంలో గురువారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు మందడపు వెంకయ్య, మంగమ్మ దంపతులకు ఆ గ్రామంలో మొట్టమొదటి సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, తోట రామాంజనేయులు, రాణి, గాంధీ, మడుపల్లి లక్ష్మణ్, మందడపు నాగకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లు నిఘా ఏర్పాటు చేసుకోవాలి

కల్లూరురూరల్: బ్యాంకర్లు నిరంతరం నిఘా ఏర్పాటు చేసుకోవాలని కల్లూరు ఎస్‌ఐ ఎస్‌కే షాకీర్ అన్నారు. గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల రాష్ట్రంలో బ్యాంక్ దొంగతనాలు పెరిగిపోయాయని, వీటిని అరికట్టేందుకు బ్యాంకర్లు సీసీ కెమేరాలు, అలారమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మండలంలో విలేకరులమని ఎవరైనా బెదిరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ‘చార్జ్ షీట్’ విడుదల చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న పాపారావు

సత్తుపల్లిటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అన్ని రంగాల్లో విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పాపారావు విమర్శించారు. గురువారం సత్తుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ చార్జ్ షీట్ విడుదల చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఈ.వీ.రమేష్, నాయుడు రాఘవరావు, వీరంరాజు, పడిగల మధుసూదన్, పాలకొల్లు శ్రీను, నాగస్వామి, బాలకృష్ణారెడ్డి, కృష్ణయ్య, భాస్కర్‌రావు, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై నిర్బంధం సరికాదు

కారేపల్లి: లగచర్లలో ఫార్మాసిటీ కంపెనీ పేరుతో పేద రైతులను భయభ్రాంతులకు గురిచేసి వారి నుంచి భూములను లాక్కోవాలని చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని.. సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కారేపల్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ గిరిజన సంఘం, సీఐటీయూ, ఐద్వా ఆధ్వర్యంలో లగచర్ల ఘటనకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం బేషాజాలకు పోకుండా బాధితులకు న్యాయం చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, పోలీసు నిర్బంధాలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఏకాంబరం, రామారావు, శోభన్‌నాయక్, ఉమావతి, వినోద్, పద్మ, ఉమా, బాలు తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని నిర్మూలించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్

మధిర: క్షయ వ్యాధిని నిర్మూలించాలని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ తెలిపారు. గురువారం మహదేవపురం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలోని రాయపట్నం గ్రామంలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి.. లక్షణాలున్న వారి నమూనాలను సేకరించి ఖమ్మం పరీక్ష కేంద్రానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ ప్రత్యేక అధికారి విజయ్ కుమార్, సిబ్బంది వెంకటేశ్వర్లు, సందీప్, శివ, లంకా కొండయ్య, ఐశ్వర్య, విజయకుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడి మృతిపై సంతాపం



వాల్యా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా/కొణిజర్ల: వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ సోదరుడు వాల్యా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఈమేరకు భద్రాద్రి జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండలో ఆయన మృతదేహం వద్ద వైరా, కొణిజర్లకు చెందిన కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కాంగ్రెస్ నాయకులు కట్ల రంగారావు, కట్ల సంతోష్, కట్ల నాగరాజు, పొదిలి హరినాథ్, కోసూరి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, నాగరాజు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

వైరా: వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో జీవీ మాల్ విశిష్ట ఫౌండేషన్ నిర్వాహకులు గుర్రం, సీత, గుర్రం సుప్రియలు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల కార్యదర్శి కొల్లా రాంబాబు, పాఠశాల హెచ్‌ఎం మాధవరావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, అనిత దేవి, వెంకటేశ్వర్లు, పీటీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెరకు ఫ్యాక్టరీలో క్రషింగ్ ప్రారంభం



ఫ్యాక్టరీలో క్రషింగ్‌ను ప్రారంభిస్తున్న వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరరావు

కల్లూరు: కల్లూరు కాకతీయ షుగర్ ఫ్యాక్టరీలో గురువారం 2024–25 క్రషింగ్ సీజన్‌కు సంబంధించి ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగుళ్ల నాగేశ్వరరావు పూజలు నిర్వహించి స్విచ్ ఆన్ చేసి క్రషింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో 60 వేల టన్నులు మాత్రమే క్రషింగ్ అవుతుందన్నారు. వచ్చే క్రసింగ్ సీజన్‌లో 5 వేల ఎకరాలలో చెరకు సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. చెరకుకు కేంద్ర ప్రభుత్వం టున్నకు రూ. 3,151 మద్దతు ధర నిర్ణయించిందని దీనికి ఫ్యాక్టరీ యాజమాన్యం రూ. 49 కలిపి రూ. 3,200 మద్దతు ధర చెల్లించడం జరుగుతుందని తెలిపారు. చెరకు సాగు చేసే రైతులకు అన్ని విధాలుగా ప్రోత్సహించి ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ కస్తాల నరేందర్, ఫ్యాక్టరీ సివిల్ ఇంజనీర్ కొడాలి రఘునాథబాబు, కేన్ మేనేజర్ నరసింహమూర్తి, హెచ్‌ఆర్ మేనేజర్ కుమారచంద్ర, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

మధిర: ప్రతి ఉపాధ్యాయుడు వృత్తి పట్ల అంకితభావంతో పని చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి షేక్.నాగూర్ వలీ తెలిపారు. గురువారం యూటీఎఫ్ మధిర ప్రాంతీయ కార్యాలయంలో నూతన ఉపాధ్యాయులకు సర్వీస్ మేటర్స్‌పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సర్వీస్ మేటర్స్, సర్వీస్ బుక్ నిర్వహణ, సెలవు నిబంధనలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, రిటైర్డ్ ఎంఈఓ అనుమోలు భాస్కరరావు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంట అవశేషాలను కాల్చవద్దు

ఏన్కూరు/తల్లాడ: పంట అవశేషాలను కాల్చవద్దని మండల వ్యవసాయాధికారులు నర్సింహారావు, ఎండీ తాజుద్దీన్ తెలిపారు. ఏన్కూరు, తల్లాడ మండలంలో అన్ని గ్రామాల్లోని పొలాలను పరిశీలించి మాట్లాడారు. వరికొయ్యలను కాల్చడం వలన మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని నేల సంతులనం కోల్పోతుందన్నారు. మరుయి మట్టిలో నీటి నిలువ ఉంచుకునే శక్తి తగ్గిపోతుందన్నారు. మరియు వాయు కాలుష్యం ఏర్పడుతుందన్నారు. వరి పంటల అవశేషాలు కాల్చకుండ భూమిలో కలియ దున్నడం వలన భూమి ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.

చెరువుల పరిరక్షణకు కృషి చేయాలి

కారేపల్లి: చెరువుల పరిరక్షణకు పాలకులు కృషి చేయాలని, మత్స్యకార్మికులకు ప్రభుత్వాలు అండగా నిలవాలని ముదిరాజ్ సంఘం, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు తురక రాంబాబు, తురక నారాయణలు అన్నారు. గురువారం కారేపల్లిలో ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వమించారు. ఈ సందర్భంగా.. కారేపల్లి పెద్ద చెరువు ఒడ్డున, బస్టాండ్ సెంటర్‌లలో మత్స్య కార్మికుల, ముదిరాజ్ సంఘాల జెండాను ఎగురవేశారు. అంతకుముందు ముదిరాజ్‌లు కారేపల్లి బస్టాండ్ సెంటర్ నుంచి సినిమాహాల్ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, గణేష్ సెంటర్‌ల మీదుగా ర్యాలీగా ప్రదర్శన నిర్వహించారు. చెరువు శిఖం భూములను కాపాడి, మత్స్యకారులకు అప్పగించాలని, వాటి పరిరక్షణ బాధ్యతలను మత్స్యకారులకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాంబయ్య, రామస్వామి, సత్యనారాయణ, సత్యం, సంపత్, యాదగిరి, శ్రీను, రవి, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

పాస్టర్లందరికీ గౌరవ వేతనం అందించాలి



మాట్లాడుతున్న ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌పాల్

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలో పాస్టర్లందరికీ గౌరవ వేతనం ఇవ్వాలని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామ్‌పాల్ పేర్కొన్నారు. గురువారం సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ క్రీస్తు సంఘం ప్రార్థనా మందిరంలో రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఎన్‌సీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల్లో పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చేందుకు ప్రభుత్వాలు సుముఖత చూపాయని అదే విధంగా తెలంగాణ ప్రభుత్వం కూడా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో నేషనల్ సెక్రటరీ జనరల్ సిలివియా జయదీప్, జాతీయ ఉపాధ్యక్షురాలు బ్రెట్టీ బ్యూలా, బిషప్ సంజయ్ ఆనంద్, ఎస్.బాలస్వామి, దేవ సహాయం, పింగళి సామేలు, ఎస్.శ్రీనివాస్, నాగార్జున, సత్యానందం, స్వరూప్‌రాజ్, సదానంద, నిరీక్షణరావు పాల్గొన్నారు.


బీఫార్మసీ తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్

సత్తుపల్లి: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలోని హెటిరో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసూట్యికల్ కళాశాలలో సైసెన్స్ గురువారం బీఫార్మసీ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూహెచ్ కళాశాల ప్రొఫెసర్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ.. బీఫార్మసీ విద్యకు దేశ విదేశాలలో ఎందరలో నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఉన్నత శిఖరాలు చేరుకోగలిగారన్నారు. ఇటువంటి విద్యను ఈ ప్రాంతంలో అందుబాటులోకి రావటం శుభ పరిణామన్నారు. రాజ్యసభ సభ్యుడు, హెటిరో చైర్మన్ డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విదవర్చువల్‌గా మాట్లాడుతూ.. క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధిస్తే 100శాతం ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, పి.నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే ‘చెకుముకి’



మధిర: ప్రశ్నాపత్రం విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు



వైరా: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం



తల్లాడ: జిల్లాస్థాయికి ఎంపికైన పినపాక విద్యార్థులు

మధిర/బోనకల్/చింతకాని/ఎర్రుపాలెం: పాఠశాలస్థాయిలో విద్యార్థుల ప్రతిభ గుర్తించేందుకే చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బి.డేవిడ్‌రాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ కన్వీనర్ అలవాల నాగేందర్, ఎంఈఓ శ్రీనివాసరావు తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో.. మధిరలోని సీపీఎస్, బోనకల్ రావినూతల, చింతకాని, లచ్చగూడెం పాఠశాలలు, ఎర్రుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం చెకుముకి పోటీలు నిర్వహించారు. ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో పరీక్షలు నిర్వహించగా.. పలు ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ టాలెంట్ టెస్ట్ పాఠశాల స్థాయిలో పూర్తయిందన్నారు. ప్రథమస్థానంలో గెలుపొందినవారికి ఈ నెల 28న జిల్లా స్థాయిలో ఖమ్మంలో పోటీ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్ష, కార్యదర్శులు ధనిశెట్టి భాస్కరరావు, రవి, భీమరాజు, జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ మెంబర్ వెంకట అప్పారావు, రావినూతల పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కోటేశ్వరరావు, చెకుముకి మండల కన్వీనర్ ప్రమీల, వెంకటేశ్వర్లు, గౌసుద్దీన్, శ్రీనివాసరావు, సరస్వతి, చింతకాని, లచ్చగూడెం పాఠశాలల హెచ్‌ఎంలు బీవీ శర్మ, మహ్మద్ హుస్సేన్, ఎర్రుపాలెం పాఠశాల హెచ్‌ఎం జీవీఎస్ రాజు, ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

- **వైరా/కొణిజర్ల/కారేపల్లి:** వైరా మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మొదటి బహుమతి వైరా జీహెచ్‌ఎస్, రెండో బహుమతి రెబ్బవరం, జెడ్పీహెచ్‌ఎస్, రెసిడెన్షియల్ స్కూల్ విభాగంలో మొదటి బహుమతి టీఎస్‌ఆర్‌ఎస్ గర్ల్స్, రెండో బహుమతి టీజీటీడబ్ల్యూయూఆర్‌జేసీ గర్ల్స్, వైరా, ప్రైవేట్ పాఠశాలలో విభాగంలో మొదటి బహుమతి వైరా మధు విద్యాలయం, రెండో బహుతి వాణి వివేకనంద విద్యాలయం విద్యార్థులు గెలుపొందారు. అదే విధంగా కొణిజర్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో ఎంఈఓ దొడ్డిగర్ల అబ్రహం, పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కారేపల్లి మోడల్‌స్కూల్‌లో నిర్వహించిన పోటీల్లో మండలంలోని 13 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ వెంకటరెడ్డి, కార్యదర్శి ప్రేమ్‌సాగర్‌లు, ఉపాధ్యాయులు హనుమ, భద్రయ్య, రంజాన్, రవి, వాసు, రామారావు, చంద్ర శేఖర్ పాల్గొన్నారు.
- **తల్లాడ/సత్తుపల్లిరూరల్/కల్లూరు:** తల్లాడ పాఠశాల, సత్తుపల్లి పాఠశాల్లో గురువారం మండలస్థాయిలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొని.. గెలుపొందారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, ఉపాధ్యాయులు మెమోంటోలు, ప్రసంశా పత్రాలు అందించి అభినందించారు. అదే విధంగా కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి పోటీల్లో గెలుపొందిన వారికి రైటింగ్ ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వి.మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేష్, పురుషోత్తమరావు, ప్రసాద్, రత్నాకర్, జాని, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, టాలెంట్ టెస్ట్ నిర్వాహకులు అల్లెంజార్, సుధీర్, శ్రీనివాస్, వీరరాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.